## పత్రికా ప్రకటన

హైదరాబాద్,

తేదీ: 07-04-2007

# వైద్యరంగంలో ప్రభుత్వం తీరు ప్రమాదకరంగా ఉంది

## -జయప్రకాశ్ నారాయణ్-

ప్రజారోగ్య రంగంలో నెలకొన్న సంక్షుభిత పరిస్థితుల పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీన, బాధ్యతారహిత వైఖరిని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజారోగ్య బాధ్యత నుంచి క్రమంగా ప్రభుత్వం వైదొలుగుతుండటం వల్ల దారుణపరిస్థితులు ఏర్పడ్డాయని పార్టీ జాతీయ సమన్వయకర్త డా॥జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. అనారోగ్యంతో అప్పులబారిన పడి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, సరైన వ్యాక్సిన్లు లేక పిల్లలు మృత్యువుబారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మన స్థూలజాతీయోత్పత్తిలో 1శాతం కూడా మనం ఆరోగ్యం కోసం వెచ్చించటం లేదు. ఆరోగ్యరంగంలో మనకంటే తక్కువగా ఖర్చు చేస్తున్న దేశాలు ప్రపంచంలో మూడు మాత్రమే ఉన్నాయి...అవి మియాన్మర్, కాంబోడియా, ఆఫ్ఘనిస్తాన్. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండో దేశంలో పరిస్థితి ఇలా ఉండటం శోచనీయం" అని జేపీ అన్నారు.

నీలోఫర్ ఆసుపత్రి వద్ద జయప్రకాశ్ నారాయణ్ మీడియాతో మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్యదినం సందర్భంగా ఆరోగ్యరంగంలో సంక్షోభాన్ని గురించి చైతన్యపరిచేందుకు లోక్‌సత్తా పార్టీ శనివారం నిర్వహించిన మౌనప్రదర్శనకు ఆయన సారథ్యం వహించారు. పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి నీలోఫర్ ఆసుపత్రి వరకు పార్టీ కార్యకర్తలు మౌనప్రదర్శనగా వచ్చారు. అంతకుముందు జేపీ జియాగూడలో గతనెల 28న కుక్కకాటుకు, వైద్యుల నిర్లక్ష్యానికి 8నెలల పసిబిడ్డను కోల్పోయిన రంజీత్ సింగ్, మీరాబాయి కుటుంబాన్ని పరామర్శించారు. ఉస్మానియా, నీలోఫర్, రెడ్‌క్రాస్ సొసైటీ, ఫీవర్ హాస్పిటల్, మళ్లీ నీలోఫర్ ఇలా ఐదు ఆసుపత్రులు తిరిగినా ఒక పసిబిడ్డ ప్రాణాన్ని కాపాడలేకపోయిన వైద్యవ్యవస్థ పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం నీలోఫర్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, వైద్యరంగంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీన వైఖరిపై జయప్రకాశ్ నారాయణ్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి, ఆరోగ్యమంత్రి అనుసరిస్తున్న విధానాలు, ప్రవేశపెడుతున్న ఆరోగ్య పథకాలు వారి అవగాహనాలేమిని సూచిస్తున్నాయన్నారు. క్రమంగా ప్రభుత్వం వైద్యరంగాన్ని ప్రైవేటుపరం చేసి చేతులు దులుపుకోవాలనుకుంటోందని, ఇది వినాశకర పరిణామాలకు దారితీస్తుందని జేపీ హెచ్చరించారు. దేశస్థూల జాతీయాదాయం కన్నా వేగంగా పెరుగుతున్న వైద్యఖర్చుల వల్ల రాబోయేకాలంలో ప్రజలు అల్లాడిపోతారని, వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం తప్పించుకోవటం ఎంత ఘోరం అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే పరిస్థితి దిగజారిందన్నారు. "మనదేశంలో ఓ వ్యక్తి ఆసుపత్రిలో చేరాడంటే, అతని సంవత్సర ఆదాయంలో 60శాతం అక్కడే ఖర్చయిపోతుంది. దాదాపు 40శాతంమంది వైద్యఖర్చులకోసం ఆస్తుల్ని తనఖాపెట్టుకుని 5నుంచి10శాతం వరకు వడ్డీతో అప్పులు తెచ్చుకుంటున్నారు. కేవలం ఆరోగ్యసమస్యలతో తీసుకుంటున్న అప్పుల వల్ల దేశంలోని 25శాతం కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువకు జారిపోతున్నాయి. భవిష్యత్తులో ఈ ప్రమాదం మరింత పెరుగుతుంది" అని జయప్రకాశ్ అన్నారు.

ఇంత జటిలమైన సంక్షోభాన్ని పరిష్కరించటానికి ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధిని, ముందుచూపును ప్రదర్శించటం లేదని జేపీ పేర్కొన్నారు. భావిపౌరుల ఆరోగ్యం పట్ల రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న మూర్ఖపు వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. జబ్బును నివారించటానికి కాకుండా, జబ్బు వచ్చాక నయం చేయటానికి పథకాల్ని, పరిహారాల్ని ప్రకటించటం వల్ల ఫలితం ఉండదని, అది ఖజానాకు అదనపు భారంగా మారుతుందని అన్నారు. గుండెజబ్బులతో బాధపడుతున్న కొంతమంది చిన్నారులకు వైద్యం చేయటానికి కోట్లు వెచ్చించటం సమస్యకు పరిష్కారం కాదన్నారు. కేవలం రూ.5కోట్లు వెచ్చించి పిల్లలందరికీ ఎం.ఎం.ఆర్ వ్యాక్సిన్ వేయిస్తే, కంజినిటల్ గుండెజబ్బుల్ని చాలామేరకు నివారించవచ్చని అన్నారు. ఏటా 15,000మంది పిల్లలు ఈ జబ్బు బారినపడుతున్నారు. అలాగే ర్యూమాటిక్ గుండెజబ్బుల్ని కూడా నివారిస్తే, ఏటా మరో 15వేల మంది పిల్లల్ని కాపాడినవారమవుతాం అని జేపీ చెప్పారు.

ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం ఏ కోణంలో చూసినా పనికిమాలిన పథకమని జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. రూ.65కోట్లు వెచ్చిస్తే, లక్షల మందిలో ఎంతమందికి వైద్యం అందించగలుగుతారు? కేవలం 6-7వేల మందికి మాత్రమే. పెద్దజబ్బు చేసిన రోగికి చికిత్స చేయాలంటే కార్పొరేట్ ఆసుపత్రి కనీసం లక్షరూపాయల బిల్లు వేస్తుంది. రెండోది, సంప్రదాయక ఆరోగ్య బీమా పథకం భారత్ వంటి దేశాల్లో ఏమాత్రం విజయవంతమవదు. ఇక్కడి ప్రజల్లో 90శాతంమంది అసంఘటితరంగంలో ఉన్నారు. వీరికి గ్యారంటీ ఆదాయపు వనరులు ఉండవు. మూల ఆదాయం నుంచి ఇన్సూరెన్స్ ప్రీమియంను కత్తిరించే అవకాశం ఉండదు. మూడోది, ఇమ్యూనైజేషన్, మలేరియా కంట్రోల్, మాతాశిశుసంరక్షణలకు సంబంధించి సరైన విధానాలు, సౌకర్యాలు లేకపోవటం వల్ల ప్రివెంటివ్ హెల్త్‌కేర్ విఫలమవుతోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య శ్రీ ఓ అట్టహాసంగా చెప్పుకోటానికి తప్ప ఆరోగ్య సమస్యలను ఏమాత్రం పరిష్కరించలేదు అని జయప్రకాశ్ అన్నారు.

"తక్కువ ఖర్చుతో జబ్బుల నివారణకు ప్రయత్నించని ప్రభుత్వం పెద్ద పేరు పెట్టి పథకాన్ని ప్రారంభించి, కోట్ల రూపాయలను ప్రైవేటు ఆసుపత్రుల పరం చేస్తోంది. ఇది పేదల ప్రాణాల్ని తృణప్రాయంగా చూడటమే" అని ఆయన పేర్కొన్నారు.

## డబ్బును బట్టి వైద్యం కాదు...వైద్యాన్ని బట్టి డబ్బు...ఇదీ లోక్‌సత్తా విధానం

ఈ తీవ్ర సమస్య మీద లోక్‌సత్తా పార్టీకి స్పష్టమైన విధానం ఉంది అని జయప్రకాశ్ నారాయణ్ పేర్కొన్నారు. "ప్రివెంటివ్, ప్రైమరీ హెల్త్‌కేర్‌ను బలోపేతం చేసి, స్థానిక ప్రభుత్వాల నిర్వహణలో ఉంచాలి. ప్రతి లక్షమంది జనాభాకు ఓ 30-50 పడకల ఆసుపత్రిని స్థానిక ప్రభుత్వం ప్రారంభిస్తుంది. వీటి నిర్వహణకు కొంత నిధిని కేటాయిస్తుంది. డబ్బును బట్టి వైద్యంకాకుండా, వైద్యాన్ని బట్టి డబ్బు ఉంటుంది. రోగికి ఎంత ఖరీదైన వైద్యమైనా సక్రమంగా పూర్తయ్యాక, ప్రభుత్వం ఖర్చును రీ ఇంబర్స్ చేస్తుంది. అందరికీ ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందుతాయి. మరోవైపు, చేసిన ట్రీట్‌మెంట్‌ని బట్టే డాక్టర్‌కి ఆదాయం ఉంటుంది. ప్రజలు తమకు సౌకర్యవంతమైన, నమ్మకమైన ఆసుపత్రిని ఎంచుకోవచ్చు. ఈ నేపథ్యంలో పేషంట్లను ఆకర్షించాలంటే వైద్యులు సరైన ట్రీట్‌మెంట్,సేవలు అందించాల్సి వస్తుంది. ఈ సమగ్ర ఆరోగ్యరక్షణ విధానం కొత్త తరానికి కొత్త రాజకీయానికి సంకేతంగా నిలుస్తుంది" అని జేపీ వివరించారు.

లోక్‌సత్తా ఆధ్వర్యంలో జరిగిన మౌనప్రదర్శన ఆద్యంతం ఎంతో క్రమశిక్షణతో జరిగింది. పార్టీ కార్యాలయం నుంచి జరిగిన ర్యాలీ వల్ల ఎక్కడా రోడ్ల మీద ప్రజలు ఇబ్బందిపడలేదు. ఈ నిబద్ధత పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.వి.ఎస్ వర్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు భండారి అంకయ్య, ప్రతిభారావు, సి.నరసింహారావు, మనోరమ, ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

:: లోక్‌సత్తా పార్టీ